# పునాదిరాళ్లు

పొద్దువాలి పోతోంది.

సూర్యుడు పడమటి కొండల్లో జారుకుంటున్నాడు పొద్దల్లా కష్టపడి ఇంటి ముఖం పడుతున్న రోజు కూలీలా, పేదవాణ్ణి వెంటాడే దరిద్రంలా సూర్యుణ్ణి రెండు రోజులుగా మబ్బులు వెంటాడుతూనే ఉన్నాయి.

గవరయ్య ముందు నడుస్తున్నాడు.

అతని వెనకాల పారయ్య, సన్యాసయ్య, సూరయ్య ఇంకా మరికొంత మంది కూలీలు అతన్ని అనుసరిస్తున్నారు. చలిచీమల బారులా. గవరయ్య నల్లగా నడుస్తున్న కొండలా ఉంటాడు. అతని ఛాతీ విశాలంగా ఉంటుంది. గుండె రెండు పక్కలా గమేళాలు బోర్లించినట్లు ఎత్తుగా ఉంటుంది. మనిషి మంచి పొడగరి. అతనెత్తు దరిద్రం అతన్ని పీడిస్తున్నా మనిషిల దిగులు ఉండదు. ఏభయ్యేళ్ళ మనిషిలా ఉండడు. అతనిద్దరు కూతుళ్ళకూ పెళ్ళిళ్ళు చేసాడంటే ఎవరూ నమ్మరు. ఇద్దరు కొడుకులూ ఇద్దరేసి పిల్లల తండ్రులు అన్నా గవరయ్యకి మాత్రం అంత వయసంటే ఎవరూనమ్మరు!.

చుట్టుపక్కల ఏ మట్టిపని పడినా, ఎవరు ఎక్కడ ఏ కూలిపని తలపెట్టినా గవరయ్యనే పిలుస్తారు. ముక్కుసూటి మనిషి ఎదిరించవలసి వచ్చినపుడు ఎదుటి మనిషి హోదాని, అంతస్తునీ లెక్కచెయ్యడు. కష్టపడిన మనిషి తగిన ఫలితాన్ని పొందటానికి భయమెందుకంటాడు.

అలాటి గవరయ్య నడుస్తున్నాడు దిగాలుగా సహజత్వానికి విరుద్ధంగా!

అతడికి పిక్కలు సలుపుగా ఉన్నాయి. పాదాల సూదులతో గుచ్చుతున్నట్లు పోట్లు పెడుతున్నాయి. కడుపులో పేగులు నకనకలాడుతున్నాయి. రెండు రోజులుగ చిన్న జ్వరం, చలి, వొణుకు, తలనొప్పి.

ఈ మాత్రం అనారోగ్యాన్ని ఖాతరు చేసే మనిషేకాదు. గవరయ్య

"ఏటి గవరయ్యన్నా! ఏటివాల సిమోరగుండిపోనావు. ఉలుకూ పలుకూ నేకంటా?" అన్నాడు సన్యాసయ్య.

"యాటో? గవరయ్య మాంవ పల్లకున్నాడంటే ఎక్కడో అడివిలంటుకున్నట్టే" అన్నాడు సూరయ్య.

"ఊరే సూరయ్యా! మన బతుకులు తడిసిపోయిన అగ్గిపుల్లవ్నాటివిరా? ఈటికి మండించే సత్తువ నేదురా!" గవరయ్య.

"ఎట్రోరియ్యాలంత నీరసపడి పోతున్నావు"

మవునంగా ఉండిపోయాడు గవరయ్య తలపాగాలో ఉన్న లంకపొగాకు చుట్టతీసి వెలిగించాడు. సగం వరకూ కాల్చిన తరువాత అడ్డపొగ వేశాడు. చుట్టనోట్లో కాలుతోంది.

అతని కళ్ళ ముందు మాత్రం కాలుతోంది కూతురు సంసారం.

కాలుతున్న చుట్ట నుసియై కిందపడుతున్నట్లే కూతురి జీవితమూ కాలుతోంది. అతడి

నోట్లో అడ్డపొగలాగే మవునంగా కాలుతోంది. సన్నగా కాలుతోంది. నిశ్శబ్దంగా కాలుతోంది. పొగలేకుండా కాలుతోంది.

నెల రోజులు క్రితం గవరయ్య కూతుర్ని చూడ్డానికి వెళ్ళాడు.

వెళ్ళినపుడు కోడిపుంజును తీసికొని వెళ్ళాడు. పెళ్ళాం వేసిన పోకుండలు తీసికెళ్లాడు. నూరు రూపాయల కోక తీసికెళ్ళాడు.

కూతురి ముఖం చాటంతయింది. "నాయినా, వొచ్చినావా! అమ్మ బాగుందా? అక్క కబుర్లేటి తెలిసినాయా?'' అంది.

"ఇదే అమ్మీ! మీ యమ్మనీకిట్టమని పోకుండలు సేసినాదీ, పాడురంగుకోక సుక్కురోరం సంతలో తీసుకున్నది మన పెట్టెట్టిన తొలి గుడ్డుని పిల్లని సేసినాం. అదింత పుంజయింది. పందేనికి ఎంత మందిడిగెనా నీ కోసమని ఇవ్వకంట ఉంచీసినాను'' అని గవరయ్య కూతురు కోసం తెచ్చిన వస్తువులిచ్చేశాడు.

"ఏంగవిరయ్యా! బాగున్నావా?'' అని పలకరించింది. కూతురి అత్త "ఆం.... బాగున్నానమ్మీ ఏడీ, అల్లుడెటెల్లినాడు?'' గవరయ్య అడిగాడు.

"ఏటి నాయినా ఇంట్లో కూకుంటే దినవెల్తాదా ఏటి? పోనేదో ఆ బండి ఎడ్లూ కొనుక్కుంటే ఊళ్లో పనులు దొరకుతాయనుకున్నాం. మీరా కట్నం డబ్బులూ ఇవ్వనేదూ, ఆడికా బండీ ఎడ్లు కొనుకోటం అవనేదు!! ఒరే అది గోడకేసిన సున్నవేరా, దాని కోసం ఆశపడకురా అంటే, 'మా మామలాటోడు గాదూ' అని కొండంత ఆశతో ఉన్నాడు. మరేటి ఉట్నే కూకుంటే కూడుంటాదా? గుడ్డొస్తాదా? కూలీనాలీ సేసుకోకపోతే దినమెల్లని బతుకాయె '' మెల్లగా చురకంటించింది ఆమె.

గవరయ్య గతుక్కుమన్నాడు.

పాషాణమైనా మందు పాతవరకు పేలకతప్పదన్నట్లు గవరయ్య గుండె కలుక్కుమంది. "ఉత్తిసేతులతో ఎల్తన్నావు. అమ్మి గంపెడాసతో ఎదురు సూస్తుంటాది. ఆ వగలమారి దురగమ్మ కయ్యానికి సిద్ధమవుతాది. జాగర్త సూసుకో'' అని భార్య చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి.

కళ్ళలో నీరు కనపడనివ్వకుండా కూతురు పక్కకి తిరిగింది. గవరయ్య వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు. అతని గొంతులో ఏదో ఉండచుట్టుకుని అడ్డంగా పడినట్లు మెత్తగా నలిగిపోయాడు.

" అది కాదమ్మా! గోగులొలిస్తే సేనమ్మీసి డబ్బులు తెద్దామనుకున్నాను. తానొకటి తలిస్తే దేవుడొకటి తలసినట్లు ఈ ఏడు గోగులన్నీ ఇనుపతెగులు పట్టేసినాయి. అసలే దర రాకుంటయిపోనాది. ఏదో అప్పో సప్పో సేసయినా అనుకున్న డబ్బులిస్తాను గాని మాట తప్పను.'' అన్నాడు గవరయ్య కొంచెం సర్దుకొని. కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళయినా ఇవ్వకుండా తండ్రినలా అత్త సూటిపోటి మాటలతో బాధించడం కూతురికి నచ్చలేదు.

అయినా దురగమ్మ కాళికా స్వరూపం ముందు ఎదురు చెప్పలేనిది. కాబట్టి మవునంగా ఉండిపోయింది. ఆ తరువాత అల్లుడొచ్చాడు. జగిలీడొచ్చాడు. వచ్చిన వాళ్ళెవరూ ఎప్పుడొచ్చావని గాని, వచ్చి ఎంతసేపయింది గానీ అడగనేలేదు. నలిగిపోయాడు గవరయ్య - క్రషర్‌లో చెరకు గడలా, అతని మనసు భగభగమండింది, చేతగాని దుఃఖంతో తడిసి ముద్దయింది.

రాత్రి నాకిట్లో కుక్కి మంచం వేశారు. మంచం మీద చిరుగుల బొంత, బొంత మీద పాతబట్టలు కోకలో చుట్టి తలగడాగా పెట్టారు. చుక్కల్ని చూస్తూ చుట్టకాలుస్తూ పడుకున్నాడు.

లోపల కూతుర్ని వాళ్ళు సాధిస్తున్నారు.

"అడుగే... మీ అయ్యొచ్చినడు గదా! ఆ మూడువేలూ అడుగు" అంటున్నాడు అల్లుడు.

" నీకేటి మతిగానీ పోనాదేట్రా? మావని సూసీసరికి. సంవత్సరం కితం మూడువేలు. ఉపుడు మరో ఎయ్యో పదేను వందలో కలిపిమ్మను, నేపోతే సావనానికి సిద్ధంగా ఉన్న బక్కలయినారావు అంటోంది." దురగమ్మ.

"ఏటలాగా ముంగినాగా ఉండిపోనావేటి?"దాని మావంటున్నాడు.

" ఇదిగో, ఒలే నీకే సెపుతున్నా ఆ సొమ్మిచ్చినాడా? సరే, నేపోతే నువ్వూ మీ అయ్యతో బయలుదేరు తెల్సిందా? ఎల్లు వోకిట్లో మారాజులా సుట్టతాగుతూ తొంగున్నాడు. కరాకండీగా సెప్పి , సొమ్ములు తెచ్చి ఇవ్వకపోతే పెద్ద మనుసుల ముందు పెట్టేసి తెగతెంపులు సేసీసుకోవల్సి వస్తాదని. ఎనుబోతులా కండల్ని పెంచగానే సరికాదు. సిగ్గూ సెరం ఉండాల" అంటున్నాడు అల్లుడు తలతీసేసినట్లయింది. గవరయ్యకి తొండంతెగ్గోసిన ఏనుగులా అయిపోయాడు.

"ఇదిగో నన్నేమన్నా అను ఒల్లకుంతాను మా అయ్యను మాటంతే మాత్తరం ఒప్పేదినేదు. మా అయ్య అందర్నాటో డూ కాడు మాట మీద బతికే "మనిషి" కూతురంటోంది. దానికి వాళ్ళు గయ్‌మన్నారు. గవరయ్య కళ్ళు చెమ్మగిల్లాయి.

కొడుకో, కొడుకో అని చస్తారు జనం. తండ్రిని కూతురు అర్థం చేసుకున్నట్లు ఏ కొడుకు అర్థం చేసుకుంటాడు? అంత బాధలోనూ గవరయ్య మనసు ఆనందంతో నాట్యం చేసింది.

" అంత పవురుసం ఉన్న మనిసైతే ఇచ్చీమనే" గద్దించాడు అల్లుడు తరువాతేం జరిగిందో తెలీదు. మాటలు మరి వినిపించలేదు. విదియచంద్రుడు పేదవాని పెదాలమీద చిరునవ్వులా మాయమయాడు కూతురు వచ్చింది. "అయ్యా!" తొంగోనేదా?" అడిగింది.

"నేదమ్మా"

కొంత సేపు అవీ ఇవీ అడిగింది. తటపటాయించింది. తండ్రిని విషయం ఎలా అడగాలో తెలీక నజ్జు గుజ్జులు పడింది. అతడికామె పరిస్థితి అర్థమయింది. అందుకే, "అమ్మి అల్లుడికి సెప్పు రెణ్ణెల్లలో కట్నం డబ్బులు ఎలాగైన కూడబట్టి ఇచ్చెస్తాను. ఎక్కడా దొరక్కపోతే మడిసెక్క తాకట్టెట్టయి నా మాట నిలబెట్టుకుంతాను. నా మాట్నమ్మమ్మా ఆవీసమయిపోనాది. 'ఉరే ఈ సవసరం సెనగ పిక్కవెయ్యిరా అంతే ఇనకంట మీ యన్న జనువులు జల్లీ సినాడు. ఇనప తెగులు పట్టీసినాది. ఎందుకూ పనికి రాకంటయిపోనాది" అన్నాడ దిగాలుగా.

కూతురు వెక్కివెక్కి ఏడ్చింది.

" అమ్మి సీ ఏడవకూ నాకు తెల్సునీ బాధ నెగ " అని దగ్గరకు తీసుకున్నాడు. "నాయినా, అమ్మకీ సంగతులు సెప్పకుమీ" అని చేతిలో చెయ్యి వేయించుకుంది.

అక్కణ్ణుంచి వచ్చిన తరువాత మడిసెక్కబేరం పెట్టబోతే కోడలుఒప్పుకోలేదు "నీ కూతురి బతుక్కోసం మడిసెక్క అమ్మేస్తే మావేటయిపోవాల?" అంది.

అదీ నిజమేనని పించింది.

ఎక్కడికెళ్ళినా, ఎవర్ని బ్రతిమాలినా అప్పు పుట్టలేదు గవర్నిమెంటోళ్ళు నూతులక, 'నోస్లిస్తా'రేమోనని 'వీడీఓ' ను కనుక్కుంటే ఇంతబేగి ఏవీ రావన్నాడు పోనీ, నోనిస్తే అల్లుడి బాకీ తీరిపోద్దనుకున్నాడు అప్పులోని అప్పు!.

అదంతా గవరయ్యలో తుఫానై కల్లోలాన్ని రేపుతోంది.

గవరయ్య భారంగా నడుస్తున్నాడు. పదే పదే సన్నాసయ్య సూరయ్యలు అడగ్గా విషయం చెప్పాడు గవరయ్య.

"ఏటి! గవరయ్యన్నా. మాకందరికీ దవిర్జం చెప్పేవోడివి నువ్వింత పిరికోడివై పోతన్నావేటి? అయినా, కోటియ్యికీ మనికీ కుదిరిన ఒప్పందంపెకారం ఈ వోరం రోజుల సరుకూ మనిదేకదా! సరుకుని సొమ్ముగా సేసి ఇచ్చీమంటే మనిసికి అయిదువేలకు సచ్చురాదుగదా! ఈ వోరం రోజులూ అతగాడుమని కెలాగూ కూలిడబ్బులు ఇవ్వనేదు కూడా!'' అన్నాడు సన్నాసయ్య

" అదికాదు సన్నాసియ్యా! మనం పొరపాటు సేసినామేమోనని పిస్తంది. ఈ వోరం రోజుల సరుకునీ మనం కోటయ్య కాడే ఉంచకుండా ఉండవలసింది. డబ్బున్నోళ్ళూ, ఏ పోరస్తుల మాటల్నీ మనం అంత బేగి నమ్మకూడదు. ఆల్లు సెనసెనానికీ పేటు పిరాయించెస్తారు" అన్నాడు. గవరయ్య.

"అప్పుడు మనం పనేగేసెస్తాం" అన్నాడు సూరయ్య

" ఉరే ఎర్రోడా! మనోల్లలో కలిసికట్టుతనం నేకంటా ఆల్లు సెయ్యగల్రు. మరో పదో, పాతికో ఎక్కువ పడేస్తే - కడుపు కకుర్తికోసంమనలోనే ఎవులో ఎల్లక మాన్రు. ఆడికి పనీ జరక్కాపోదు' . అన్నాడు. గవరయ్య.

అప్పటికి 'జివిడి పేట' దాటారు.

ఇంక ఎనిమిది మైళ్ళు కొండ దారిన నడవాలి. రెండు మూడు కొండలు చుట్టి ముందుకుపోవాలి. చీకటి తెర కమ్మేసింది. ఆకాశాన్ని ఆవరించిన మబ్బులు దారిని మరింత చీకటి చేస్తున్నాయి. అయినా తెలిసిన దారి మూలాన చకచకా ముందుకు నడుస్తున్నారు.

"అప్పుడేటి సేస్తాం"?

"ఏటి సేత్తాం? సేతిల గునపాలు కోటియ్య గుండెల్లో దించుతాం. సరుకొట్టుకెళ్తాం" అన్నాడు సలాసలా మరుగుతోన్న వేడిరక్తపు యువకుడు.

అది అసాధ్యం అని తెలిపే పేలవమయిన నవ్వు గవరయ్య పెదాల మీద తాండవించటం చీకట్లో ఎవరికీ కనిపించలేదు. చిన్నచిన్న చినుకులు టపాటపా రాల్తున్నాయి.

"ఏటిది? వానొస్తాదోఏటో? బేగినడవండి" అన్నాడు గవరయ్య అందరూ ముందుకు నడుస్తున్నారు. కాళ్ళలో రాళ్ళు గుచ్చుకుంటున్నాయి. " అమ్మా!" అన్నాడు గవరయ్య. రక్తం బొటబొటాకారింది. బొటన వేల్తో గట్టిగా నొక్కి పట్టుకున్నాడు. అయినా ఆగలేదు రక్తం. తలగుడ్డ చింపి గట్టిగా కట్టాడు. ముందుకు నడుస్తున్నాడు.

దారినిండా తుమ్మపొదలు. వాటిక్రింద ఎవరో వంటచెరకు కోసం కొట్టివుంచిన

తుమ్మకంపలు. చీకట్లో కనిపించటంలేదు వాటిని తప్పించుకుని దారి చేసుకుని నడుస్తున్నారు. అయినా అక్కడక్కడ ముళ్ళ కంపలు చర్మాన్ని గీరేస్తున్నాయి.

"ఉరే, గవిరయ్యన్నా! కోటయ్య ఈ దెబ్బతో నచ్చాతికరైపోతాడ్రా!"

"నచ్చాతికారేట్రా, ఇలాగే ఎవులూ సూడకపోతే కోటీస్వరుడే అయిపోతాడు".

సన్నాసయ్య కాలికిందరాయి జారింది. ముందుకు తూలాడు. పట్టుకోడానికేదీ దొరకలేదు. దభీమని పడిపోయాడు. "ఒరే, సచ్చిపోనాన్రా!" సెయ్యి ఊతివ్వండిరా!" అన్నాడు అప్పటికే కొండలోయల్లోకి జారిపోతున్నాడు సన్నాసయ్య కళ్ళలో ప్రాణభయం ఎవరికీ కనిపించటం లేదు. సమయానికి అక్కడ ఒక చెట్టు ఆధారంగా కనిపించింది. దాన్ని పట్టుకున్నాడు వెంటనే అందరూ సన్నాసయ్యని రెక్కకట్టుకుని పైకిలాగేసారు.

సన్నాసయ్యకి మోకాళ్ళూ మోచేతులూ చెక్కుకుపోయాయి. బతికి బయట పడ్డానన్న సంతోషం అతని బాధని కప్పేసింది. సూరయ్యతన చేతిలో ఉన్నటార్చిలైట్ వేసాడు. దానిలో బేటరీలు అయిపోవటంవల్ల దరిద్రుని ముఖంలో కాంతిలాగా కనిపిస్తోంది. సన్నాసయ్య దెబ్బతగిలినచోట ఉమ్మితడిరాసుకుంటున్నాడు. తడితగాలగానే కారం జల్లినట్టయి ప్రాణం విలవిలలాడింది.

చిత్తడి చినుకుల వల్ల అడుగు తీసి అడుగువేస్తే కాలు జారుతోంది. కొండ చీపురు దుబ్బులూ, డొంకలూ, తుప్పలూ, దారికడ్డంగా ఉన్నాయి. వాటిని పట్టుకుని ముందుకు నడుస్తున్నారు.

ఒక కొండ దిగారు రెండోకొండ చుట్టూరా వెళ్ళాలి అక్కడ నుండి ఎగుడు, దిగుడు రాళ్ళు దాటి ఎత్తయిన కొండ ఎక్కాలి అడుగేస్తున్న కొద్దీ కండరాలు పట్టేస్తున్నాయి. ఇప్పటికి సుమారు నెలరోజుల పైగారోజూ ఇదే వరస!

ఒక రోజు కోటయ్య గవరయ్యనితీసుకుని కొండమీద కెళ్ళాడు. ఫారెస్టు వాళ్ళకి తెలీకుండా టేకు చెట్లు కొట్టించాడు ఆ కొట్టించినపుడు ఆ టేకు చెట్టు వేళ్ళు పెకలించుకుని వచ్చిన మట్టిలో ఏవో రాళ్ళను వింతగా చూసాడు అతనికేదో ఆలోచన మెరుపై మెరిసింది. "ఉరే గవరయ్య! ఓగంపడు మట్టితియ్యరా! మొక్కలకిది గొప్ప సత్తువ మన వంగ మొక్కలకేస్తే గొప్ప కాపుకాస్తది" అన్నాడు.

గవరయ్య తవ్వాడు.

అతని చేతిలో గునపం భూమిలోకి దిగుతోంది. మట్టిని తీస్తున్నారు. అతనంతే చూస్తున్నాడు. కోటయ్య కళ్ళు మాత్రం సూర్యకాంతి పడ్డరత్నాలయ్యాయి.

అంతే!

అక్కణ్ణుంచి రోజూ మట్టిని తవ్విస్తునే ఉన్నాడు దాన్ని వాళ్ళతో పొలానికని చెప్పి ఇంటికి చేరవేస్తునే ఉన్నాడు వాటిలో తనకి కావలసినవి తను ఏరుకుంటునే ఉన్నాడు కొన్నాళ్ళు గడిచేసరికి కోటయ్య తాహతు పెరిగింది.

గవరయ్యకి అప్పటికి తెలిసింది. ఈ తవ్వకం కేవలం మట్టి కోసం కాదని. దీనిలో ఏదో రాహస్యం ఉందని అందరితో కలిసి ఆలోచించాడు. కూపీతీసాడు.

కొండ చిలువలా పెద్ద చీకటి నోటితో అప్పటికే కొండసారంగం అయింది. గవరయ్య

అందరినీ సమావేశపరిచాడు. విషయంచెప్పాడు. అందరూ నిర్ణయం తీసుకున్నారు. కోటయ్య దగ్గర కెళ్ళారు. గవరయ్య వెళ్ళేసరికి కోటయ్య పెట్రోమాక్సు లైట్లతో రెడీగా ఉన్నాడు.

అందరూ నిలబడ్డారు.

"కోటయ్య గోరూ! నెల్రోలుగా కొండ తవ్వుతన్నాం. మా జబ్బలు పులిసి పోతన్నాయి. మీరిచ్చిన కూలి సాలటం నేదు". అన్నాడు గవరయ్య .

"అయితే వింతియ్య మంతావురా?"

"ఎంతిచ్చినా సాల్దు. నీ కొచ్చిన దాంట్లో సగం మాకిచ్చి, కూలి డబ్బులివ్వొద్దు". అన్నాడు గవరయ్య.

కోటయ్య గుడ్లప్పగించాడు. రహస్యం వీళ్ళకి తెలిసిపోయిందే అని గతుక్కుమన్నాడు. వెకిలి నవ్వునవ్వాడు బయట పడకుండా నిభాయించుకున్నాడు. "హె.హె. హే పొలానికి మట్టి బాగుంటుందని ఆశపడుతున్నాను. దీన్లో నాకు ఊడిపడేదేంది? మనిషికి నూరు కూలిపోతోంది. మరో ఏభై తీసుకోండి" అన్నాడు.

"నాబంనేదు మేం గొర్రెల్నాగా అయిపోనాంనువ్వేమంత ఎర్రోడివి గావు. మావూ ఇప్పుడు నిన్ను నమ్మేటంత అమాయికులంగాం నువ్వు కాదంటే అందరికీ చెప్పేత్తాం పోలీసోల్లని రంగంలోనికి దింపితే, నువ్వు మట్టి కోసమే కొండని తవ్విత్తన్నావో, మానిక్యాల కోసమేకొండని తవ్విత్తన్నావో ఎవ్వారం తేలిపోద్ది" అన్నాడు.

గవరయ్య ఆమాటనే సరికి కోటయ్య మిడిగుడ్లేసాడు కాళ్ళ బేరానికి రాకతప్పలేదు.

"ఇదిగో గవరయ్య! అయితేటంతావు సెప్పరా? నీనేటి నీ మాటెప్పుడన్నా కాదన్నానా?" అన్నాడు

అప్పుడు చెప్పారంతా

"ఒక వారం రోజులకూలి అడగం మా కష్టం సొంతం చేసుకుంతాం. దీనికిష్టపడితేసరి నేకపోతే రేపట్నుండీ మీమే తవ్వుకుంతాం కొండతల్లి అందందీను" అన్నాడు గవరయ్య.

కోటయ్యకీ ఒప్పందం రుచించలేదు కానీ ఒప్పుకోపోతే రసాభాసవుతుందనుకున్నాడు. సరేనన్నాడు "అయితే ఒక షరతు సరుకు మీరు పట్టుకెళ్ళి అమ్మాటం కష్టం ధరా పలకదు ధర పలకాలంటే దానికి చెయ్యాల్సిన పని బోలెడుంది కేజీరాళ్ళకి మూడు వేలిస్తా, నాకే ఇచ్చేయ్యండి" అన్నాడు సరేనన్నారు అందరూ!

ఈ వారం రోజుల సరకూ కోటయ్యకిస్తే మనిషికి సుమారు పదివేలోస్తుంది. అని సంతోషంగా ఉన్నా - సరుకంతా కోటయ్య ఇంటిదగ్గరే ఉంచటం చేత - సరకు తనకివ్వలేదని తరువాత కోటయ్య బుకాయిస్తాడేమో-నన్న బెంగ కొండ చిలువలా పెరుగుతునే ఉంది.

క్రితం రోజు మాత్రం గవరయ్య చెప్పేసాడు.

'రేపటికి వారం రోజులు పూర్తవుతుంది. సరుకు మొత్తం తూకం వేసి ధర కట్టెయ్యాలని!

"తప్పదా?" అన్నాడు కోటెయ్య

" ఏటెందల మల్లీ పేసికీలున్నాయా?" గద్దించాడు గవరయ్య " హచ్చే నీనేమన్నాను.

రేపు నీనింటికాడుంటాను. సరుకొట్టుకుని రండి. తెల్లారకుంట ఒచ్చీయండి గుట్టుసప్పుడు కాకూడదు. లైట్లక్కడే ఉంచుతాను'' అని చెప్పాడు కోటయ్య ఎవరి కెంతోస్తుందోనన్న ఆలోచనలతోనూ, ఆనందంతోనూ ముందుకు నడుస్తున్నారు ఇంతలో ఏదో ధ్వని చీకట్లో ఏదో జంతువు అరుపు భయంకరంగా

బ్బ.....బ్బ.....బ్బ.....బ్బ....బ్బ.....
గవరయ్యా... బంటొస్తన్నాట్లుంది. బిరాల పరుగెత్తండి!''

అందరూ పరుగెడుతున్నారు గవరయ్య పిక్కలు పచ్చిపళ్ళుగా ఉన్నాయి. కడుపులో పేగులు ముద్దగా అయిపోతున్నాయి. చెవుల్లోంచి ముక్కులోంచి. కళ్ళలోంచి.. ఆవిర్లు .. గాడ్పులు... సెగలు! అంత చలిలోనూ శరీరం అంతా చెమట మయం!.

భయం.. ఒణుకు!

తలో దిక్కూ పారిపోతున్నారు.

బ్బ...బ్బ...బ్బ!

అదే.. ఎలుగుబంటి దగ్గరవుతోంది.

గవరయ్యకు దిక్కుతోచలేదు. అగ్గి పెట్టె ఉంది. పుల్ల వెలిగిద్దామంటే ఉన్న ఒక్కపుల్ల ఇందాకే అయిపోయింది. అగ్గి వెలుగు చూపితే ఎలుగు పారిపోతుంది. సన్నాసయ్య ముందు జాగ్రత్తగా దివిటీ పట్టుకునే వాడు. కానీ ఇవాళ తెచ్చాడో లేదో? అందునా - దగ్గర లేడు. ఎటు వేపు పరుగెత్తాడో భయంతో ఎలుగు సమీపిస్తోంది.

వీపు మీద పెఢీమని కొట్టింది ఎలుగే!

"అమ్మ సచ్చిపోనాన్రో!'' అనాలనుకున్నాడు. కానీ అనలేదు. వెంటనే అతని బుర్రలో ఏదో ఆలోచన ప్రవేశించింది. తిన్నగా ఉన్న పళంగా శవంలా పడిపోయాడు. కదల్లేదు. మెదల్లేదు. ఊపిరి లేనట్లే అయిపోయాడు.

ఎలుగు ఒళ్ళంతా వాసన చూసింది.

అలా అదివాసన చూస్తున్నపుడు గవరయ్యకు తాను బతికి ఉన్నాడో, చనిపోయాడో తెలీని అయోమయస్థితి ఒంట్లో రక్తం గడ్డకట్టేసినట్లయింది. కొంత సేపు గడిచింది. లేవాలనుకున్నా లేవలేని నిస్సత్తువ ఎలుగు ముందుకుపోతోంది.

సరిగ్గా అప్పుడే...

ఒంటి మీద నుంచి ఏదో మెత్తగా పాకుతోంది.

కాలికి చీమకుట్టింది. కదిల్తే ఏం ప్రమాదంముంచు కొస్తుందో నన్నభయం ఇంతకీ ఆ కరించింది. 'చీమేనా? ఏదేనా పురుగా?' భయం రక్తంలా దేహం నిండా ప్రవహిస్తోంది. గవరయ్యలో మొండి ధైర్యం వచ్చింది. మెల్లగా చేతిని పైకెత్తాడు. తన ఒంటి మీద నుంచి పాకుతున్నది పామని గ్రహించాడు. దాని తల ఎక్కడుందో అతనికి తెలిసిపోయింది. ఠకీమని దాని మెడ పట్టుకుని దూరంగా విసిరేసాడు. గబగబా పరుగెత్తాడు.

జారి పడ్డాడు. గడ్డం చిట్లింది. రక్తం కారుతోంది. "గవరయ్యా.. గవరయ్యా.. " సన్నాసయ్య గొంతు. దివిటీ పట్టుకుని సన్నాసయ్య, పారయ్య ఎదురొస్తున్నారు. గవరయ్యకు పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయింది. అందరూ కలుసుకున్నారు. జరిగిందంతా చెప్పుకుంటున్నారు.

కొండ దగ్గరకు చేరుకున్నారు.

"సన్నాసయ్యా! ఇయ్యాల్తో పనయిపోద్దనుకన్నా ఎలాగో బతికి బయట పడ్డా" అని గవరయ్య జరిగిందంతా చెప్పాడు. ఎన్ని కష్టాలు పడినా, తనేమయినా, ఏదేమయిపోయినా కూతురు సంసారం చక్కబడాలి! అదే గవరయ్య మనసునిండా.

అక్కడున్న సన్నాసయ్యది మరో బాధ పెళ్ళాంకి పెద్దాపరేషన్ చేయించాలి. సూరయ్య చెల్లెలి పెళ్ళిచెయ్యాలి పారయ్య షావుకారి నుంచి భూమి విడిపించుకోవాలి. మనిషికో బాధ మనసుదో ఆలోచన. ఆ ఆలోచనల్తోనే పెట్రొమాక్సు లైట్లు వెలిగించారు. నడుం చుట్టూ తుండుగుడ్డ చుట్టుకున్నారు, సొరంగం చీకటి నోట్లోకి ప్రవేశించారు. తవ్వకం ప్రారంభించారు పై వరుసల్లో ఉన్నవాళ్ళు.. కిందవాళ్ళు బంతుల్లా విసురుతూ అందిస్తోన్న గంపలనందుకుంటూ పైకి విసరుతున్నారు. కుప్పలా పోస్తున్నారు.

గంట గడిచింది.

దభేలున శబ్దం! ఆకాశం విరిగిందో, కొండచరియే మీద పడిందో, భూమే లోనికి కూరుకుపోతుందో, ఎక్కడయినా బాంబే పేలిందో ప్రళయమే సంభవించిందో తెలీని భయానక శబ్దం!

ఏమో, ఏం జరిగిందో?

కొండ ఎగిరింది ముక్కలు ముక్కలుగా రాళ్ళు తుళ్ళుతున్నాయి. వందల గజాల దూరానికి బైటున్న కూలీలు పరుగులుతీసారు. లోనున్న గవరయ్య, సూరయ్య, పారయ్య, సన్నాసయ్య వాళ్ళే మయ్యారో?

వాళ్ళకప్పుడు ఆ గనినుండి వచ్చే రాళ్ళతో పనిలేదు. కూతుళ్ళ సంసారాలు కూలిపోతాయేమోనన్న భయం లేదు. పెళ్ళాలు పొట్టలు చేత్తో పట్టుకుని ఊరేగాల్సి వస్తుందేమోనన్న చింతాలేదు. చెల్లెళ్ళ పెళ్ళి ఆగిపోతుందన్న దిగులూలేదు. దినం ఎలాగడుస్తుందోనన్న ఆందోళన లేదు. తలో చోట తెగిపడిన అవయవాల్తో చచ్చిన కప్పల్లా నేలకంటుకు పోయారు.

ఆ తరువాత -

కోటయ్య కోటీశ్వరుడే అయాడు పట్నంలో ఆకోటేశ్వర్రావు నిర్మించిన ఫైవ్‌స్టార్ హోటలుకే కాదు. అతని బంగారు భవితవ్యానికి పునాది రాళ్ళు గవరయ్యా? సన్నాసయ్యా? పారయ్యా?

ఎవరు? ఎవరని, ఎవర్నని చెప్పగలరు? ఎవరు చెప్పగలరు?

(1-10-1995 'ఈనాడు' ఆదివారం సంచిక లో ప్రచురితము)

* * * *